విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 సంచిక : 325 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ శుక్రవారం 17 ఏప్రిల్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉంది



- 2019 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇచ్చాం
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- మహిళల భాగస్వామ్యంతోనే దేశం సాధికారతవైపు పయనిస్తుంది
- సమర్థులైన మహిళలు దృఢమైన కుటుంబాలను తయారు చేస్తారు
- దృఢమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం

వివరాలు 2లో..



## దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం

- దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు
- మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారన్న ప్రధాని మోదీ
- మహిళల బిల్లు విషయంలో అందరూ కలిసి రావాలని పిలుపు

వివరాలు 2లో..

# ముఖ్యమైన ప్రాజెక్టులు గుర్తించండి

### నిధుల కేటాయింపులో వాటికి ప్రాధాన్యం
### జీఎస్‌డీపీ లక్ష్యాల సాధనకు సూక్ష్మ, స్థూల ప్రణాళికలు
### ఆర్థికశాఖ సమీక్ష సమావేశంలో సీఎం నిర్దేశం



రాష్ట్రాన్ని ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్నాయని, రెవెన్యూ లోటు భారీగా ఉందని.. వాటిని అధిగమిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని సమర్థంగా అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆర్థికశాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. శాఖల కార్యదర్శులు వారి పరిధిలోని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి, ముఖ్యమైన వాటిని గుర్తించాలని, నిధుల కేటాయింపులో వాటికి తొలి ప్రాధాన్యమివ్వాలని నిర్దేశించారు. ఆర్థికశాఖపై ముఖ్యమంత్రి గురువారం సమీక్షించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ) లక్ష్యాలను సాధించేందుకు వీలుగా సూక్ష్మ, స్థూల ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకు ఈ ప్రణాళికల్ని సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు నీరు, విద్యుత్ వంటి వనరుల్ని కొరత లేకుండా అందిస్తున్నామని, ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులున్నా

వివరాలు 2లో..

## మహిళా సాధికారతకు చరిత్రాత్మక అడుగు వేసేందుకు సిద్ధం



- మహిళ రిజర్వేషన్ బిల్లుపై స్పందించిన ప్రధాని మోదీ
- తల్లులు, సోదరీమణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవం
- డీలిమిటేషన్‌పై అపోహలు వద్దని విపక్షాలపై కిరణ్ రిజిజు విమర్శలు

వివరాలు 2లో..



## లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు

- వాడీవేడి చర్చ- శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్
- బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చు: లోక్‌సభ స్పీకర్
- డీలిమిటేషన్ బిల్లు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు

వివరాలు 2లో..

# నారా లోకేష్‌తో వీహెచ్‌పీ నేతల భేటీ..

### పలు కీలక అంశాలపై మంత్రి హామీ

- మంత్రి లోకేష్‌ను కలిసిన విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు
- గోసంరక్షణ, ఆలయ భూముల పరిరక్షణపై కీలక వినతులు
- గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామని లోకేష్ హామీ
- ధార్మిక కార్యక్రమాలకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్న వీహెచ్‌పీ
- హిందూ ధర్మ పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తామన్న మంత్రి



రాష్ట్రంలో హిందూ ధర్మ పరిరక్షణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రకటించింది. ఈ మేరకు వీహెచ్‌పీ ముఖ్య నేతలు నేడు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గోసంరక్షణ, దేవాలయ భూముల పరిరక్షణ, పురాతన ఆలయాల పునరుద్ధరణ వంటి పలు కీలక అంశాలపై వారు మంత్రితో చర్చించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్, వారికి పలు హామీలు ఇచ్చారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్ఎస్ఎస్ కార్యకర్త దొరస్వామి, ఏపీ వీహెచ్‌పీ కోశాధ్యక్షుడు వలిపర్తి

వివరాలు 2లో..



## సైనిక ఘర్షణ సమస్యలను పరిష్కరించలేదు

- భారత వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త శక్తి
- అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు జరగాలి : మోదీ
- పశ్చిమాసియా అయినా శాంతి, సుస్థిరతలకే తమ మద్దతు ఉంటుంది

వివరాలు 2లో..



## మా తొలి మిస్సైల్ దాడికే మీ నౌకలు మునిగిపోతాయ్..

- అమెరికాకు ఇరాన్ వార్నింగ్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారు
- ఇది నిజంగా మీరు చేయాల్సిన పనేనా..?
- అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా..?

## జనగణన ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు



జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. జనగణన అనేది సమాచార సేకరణ మాత్రమే కాదని అది అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో గురువారం నుంచి స్వీయ జనగణన ప్రారంభమైన నేపథ్యంలో సచివాలయంలో తన వివరాల్ని చంద్రబాబు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. https://se.census.gov.in/ వెబ్‌సైట్ ద్వారా సీఎం తన వివరాలు నమోదు చేశారు. 33 ప్రశ్నలతో

వివరాలు 2లో..

## స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



## శాంతి చర్చలు విఫలమైతే మళ్లీ యుద్ధం తప్పదు

- ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక
- "అమెరికా నిఘా సంస్థలు ఇరాన్ ప్రతి కదలికనూ గమనిస్తున్నాయి
- ముఖ్యంగా ఇరాన్ సైనిక చర్యలపై నిఘా ఉంది
- ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ అమెరికా దళాలు యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి

వివరాలు 2లో..



## బిల్లుతో లాభం తప్ప నష్టం జరగదు

- బిల్లుతో దక్షిణాదిలో పార్లమెంట్ స్థానాలు 129 నుంచి 195కు పెరుగుతాయి.
- బిల్లుపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి
- విపక్షాల ఆరోపణలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కౌంటర్

వివరాలు 2లో..

# దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం

మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర చాలా కీలకమని వివరించారు. మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని పేర్కొన్నారు. గతంలో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన విషయం గుర్తుచేసిన ప్రధాని రిజర్వేషన్లను త్వరగా అమలుచేసేందుకు చేస్తున్న ప్రయత్నానికి ఇప్పుడు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరన్న ప్రధాని మోదీ, సమయం చూసి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేమన్న మోదీ, ఈ చారిత్రక సమయంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకమని, వారిని కలుపుకుని ముందుకెళ్తున్నామని చెప్పారు. మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని కొనియాడారు.

"ఎవరైతే రాజకీయ కోణంలోనే ఆలోచిస్తారో, నేను వారికి ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నా. ఒక మిత్రుడిగా సలహా ఇస్తున్నాను. ఇది అందరికీ ఉపయోగపడుతుంది. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. మన దేశంలో ఎప్పటి నుంచి అయితే మహిళా రిజర్వేషన్ల చర్చ జరిగిందో, ఆ తర్వాత ఎప్పుడెప్పుడు ఎన్నికలు వచ్చాయో, ప్రతి ఎన్నికల్లోనూ మహిళలకు లభించే ఈ హక్కును ఎవరెవరైతే వ్యతిరేకించారో, దేశంలోని మహిళలు వారిని క్షమించలేదు. వారి పరిస్థితి అధ్వాన్నం కంటే అధ్వాన్నంగా మార్చారు. 2024 ఎన్నికల్లో మాత్రం అలా జరగలేదు. ఎందుకు జరగలేదు? ఎందుకంటే 2024లో అందరూ ఏకాభిప్రాయంతో దీనిని ఆమోదించారు. కాబట్టి ఇది ఒక అంశంగానే మిగలలేదు. ఎవరి పక్షాన రాజకీయ లబ్ధి కలగలేదు. ఎవరికీ నష్టం కూడా కలగలేదు. సహజ సిద్ధంగా ఏయే అంశాలు ఉన్నాయో ఆ అంశాల ఆధారంగానే ఎన్నికలు జరిగాయి. ఎందుకంటే 2024లో అందరూ కలిసి ఉన్నారు. చరిత్ర సాక్షిగా ఈ రోజు కూడా నేను ఒకటి చెబుతున్నాను. ఒకవేళ మనం అందరం కలిసి ఈ నిర్ణయం తీసుకుంటే అది



ఏ ఒక్క పార్టీ విజయం కాకుండా దేశ ప్రజాస్వామ్యానికే గొప్ప విజయంగా మారుతుంది."

**డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు : మోదీ**

మహిళా బిల్లుపై కొందరు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని తేల్చిచెప్పారు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు మాకు లేవని స్పష్టం చేశారు.

"దేశం విషయంలో మనమంతా ఒక్కటవ్వాలి. దేశానికి మేలు చేసే ప్రతి విషయంలో సభ్యులంతా కలవాలి. ఈ బిల్లు తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకువస్తున్నారు. విభజన రాజకీయాలు చేసే వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు మాకు లేవు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం. ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని వాగ్దానం చేస్తున్నాం. అనేక పార్టీలు మహిళల హక్కులను ఇన్నాళ్లూ అడ్డుకున్నాయి. దాన్ని గుర్తించే మేం ఇప్పుడు మహిళలకు వారి హక్కులు కల్పిస్తున్నాం. అనేక కారణాలు చూపించి గతంలో మహిళా బిల్లును అడ్డుకున్నారు. సాంకేతిక కారణాలు చూపించి 30 ఏళ్లపాటు మహిళా బిల్లును అడ్డుకున్నారు. మహిళా బిల్లుకు పార్టీలన్నీ ఏకగ్రీవంగా మద్దతివ్వాలి. మహిళలు తమ హక్కులపై 30 ఏళ్లుగా గొంతు విప్పుతున్నారు. క్షేత్రస్థాయిలో మహిళలు 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. రాజకీయాల్లో శక్తిసామర్థ్యాలు చూపించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశం ఇస్తేనే కదా వారి సామర్థ్యం తెలుస్తుంది. మహిళా బిల్లుకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది. దేశ రాజకీయాల్లో, వివిధ రంగాల్లో మహిళలను కలుపుకుని వెళ్లాల్సిందే. దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం. మహిళల పురోగతిని కొన్ని పార్టీలు ఎందుకు అడ్డుకుంటున్నాయి? మహిళల శక్తిసామర్థ్యాలు తెలుసు కనుకే వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా బిల్లు క్రెడిట్ మేం మాత్రమే తీసుకోం. మహిళా బిల్లు క్రెడిట్ అందరికీ దక్కుతుంది. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి."

**మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ : మోదీ**

"మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు. 30 ఏళ్లపాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. చారిత్రక సందర్భంగా భాగం కావటం అదృష్టంగా భావిస్తున్నా. ఈ బిల్లు దేశ దశ, దిశను మార్చనుంది. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్. మహిళా రిజర్వేషన్ బిల్లును దేశప్రజలంతా స్వాగతిస్తున్నారు. ఈ బిల్లును తేవటంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు దేశ ప్రజల కోసం తెచ్చిన బిల్లు. 30 ఏళ్ల క్రితమే మహిళా బిల్లు తెచ్చామంటున్నారు మరి ఎవరికైనా మేలు జరిగిందా? గ్రామీణస్థాయిలో రిజర్వేషన్ల వల్ల మహిళలకు రాజకీయ అవగాహన వచ్చింది. గ్రామీణ స్థాయిలో మహిళలు ఇప్పటికే నాయకులుగా రాణిస్తున్నారు. ఒక్కసారి 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చి చూస్తే మహిళా శక్తి ఏంటో చూస్తారు." అని ప్రధాని

# సైనిక ఘర్షణ సమస్యలను పరిష్కరించలేదు

పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక ఘర్షణ సమస్యలను పరిష్కరించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈవిషయంలో భారత్, ఆస్ట్రియాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని మోదీ తేల్చి చెప్పారు. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా శాంతి, సుస్థిరతలకే తమ మద్దతు ఉంటుందన్నారు. నానాటికీ పెరుగుతున్న ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను సూచించేందుకు అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో సంస్కరణలు జరగాలనే దానిపైనా భారత్, ఆస్ట్రియాలు ఒకే అభిప్రాయంతో ఉన్నాయని ప్రధాని చెప్పారు. ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ నాలుగు రోజుల భారత పర్యటన కోసం మంగళవారమే న్యూఢిల్లీకి చేరుకున్నారు. గురువారం రోజు భారత ప్రధాని, ఆస్ట్రియా ఛాన్స్‌లర్ ద్వైపాక్షిక భేటీ జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన సంయుక్త మీడియా సమావేశంలో నరేంద్ర మోదీ మాట్లాడారు.

**ప్రపంచంలో చాలా సీరియస్, ఉద్రిక్త పరిస్థితులు**

"ప్రస్తుతం యావత్ ప్రపంచం చాలా సీరియస్, ఉద్రిక్త పరిస్థితులను చవిచూస్తోంది. ఈ సవాళ్లు అన్ని ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయి, ఆందోళనకు గురి చేస్తున్నాయి. సైనిక ఘర్షణలను కొనసాగిస్తూ పోతే, శాశ్వత పరిష్కారం అనేది అస్సలు లభించదు. అందుకే పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో శాంతి, సుస్థిరతల స్థాపన అత్యవసరమని భారత్, ఆస్ట్రియా భావిస్తున్నాయి. ఇక ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించాలనే ఉమ్మడి లక్ష్యాన్ని ఇరుదేశాలు కలిగి ఉన్నాయి" అని ప్రధాని మోదీ చెప్పారు.

**భారత వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త శక్తి**

"ఇటీవలె భారత్ - యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. దీంతో భారత్, ఈయూ మధ్య సరికొత్త సువర్ణ అధ్యాయం మొదలైంది. నేను 2024లో ఆస్ట్రియా పర్యటనకు వెళ్లాను. గత 4 దశాబ్దాల్లో ఆస్ట్రియా పర్యటనకు వెళ్లిన తొలి భారత ప్రధానమంత్రిని నేనే. ఆ పర్యటన ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక మైలురాయిగా నిలిచింది. ఇప్పుడు ఆస్ట్రియా ఛాన్స్‌లర్ విదేశీ పర్యటనలో తొలి గమ్యస్థానంగా భారతే ఉండటం సంతోషకరం. భారత్‌తో సంబంధాల బలోపేతానికి ఆస్ట్రియా ఇస్తున్న ప్రాధాన్యానికి ఇదొక నిదర్శనం. ఈ పర్యటనతో ఇరుదేశాల మధ్య సహకారం, అన్ని రంగాల్లో వికాసం విషయంలో కొత్త దశ మొదలవుతుందని ఆశిస్తున్నాం. దీంతో భారతదేశ వాణిజ్యం, పెట్టుబడుల విభాగాలకూ కొత్త శక్తి లభిస్తుంది" అని ప్రధాని మోదీ తెలిపారు.

**ఆస్ట్రియా నర్సింగ్ రంగంలో భారత నిపుణులకు ఛాన్స్**

"ఆస్ట్రియా అనుభవం, భారత్ వేగం, స్థాయిలను కలగలిపి యావత్ ప్రపంచం కోసం విశ్వసనీయమైన టెక్నాలజీలు, సప్లై చైన్లను అందుబాటులోకి తెస్తాం. రక్షణ, సెమీ కండక్టర్లు, క్వాంటమ్, బయోటెక్నాలజీ విభాగాల్లోనూ ఇరుదేశాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాం. ఇందులో భాగంగా గురువారం రోజు ఐఐటీ దిల్లీ, ఆస్ట్రియాలోని మోంటన్ యూనివర్సిటీ మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 2023లోనే భారత్ - ఆస్ట్రియా మధ్య సమగ్ర వలసలు, మొబిలిటీ ఒప్పందం కుదిరింది. ఇప్పుడు కొత్తగా కుదిరిన ఒప్పందంలో భాగంగా నర్సింగ్ రంగంలోని భారత నిపుణులు కూడా ఆస్ట్రియాకు వెళ్లొచ్చు. సంయుక్త పరిశోధనలు, స్టార్టప్‌ల భాగస్వామ్యం వంటి విభాగాలనూ బలోపేతం చేస్తాం. గురువారం రోజు మేం ఇండియా - ఆస్ట్రియా వర్కింగ్ హాలిడే కార్యక్రమాన్నీ ప్రారంభిస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**టన్నెలింగ్, ఇంజినీరింగ్‌లలో ఆస్ట్రియాకు అపార అనుభవం**

"మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, సుస్థిరతతో ముడిపడిన పలు విభాగాల్లో భారత్, ఆస్ట్రియాలు ఇప్పటికే కలిసి పనిచేస్తున్నాయి. దిల్లీ మెట్రో, రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి, పట్టణ వికాసం, అటల్ టన్నెల్ (హిమాచల్ ప్రదేశ్), గిర్నార్ రోప్ వే (గుజరాత్) లాంటి ఇంజినీరింగ్ అద్భుతాలను సాకారం చేయడంలో ఆస్ట్రియన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయి. సొరంగాల నిర్మాణం(టన్నెలింగ్), ఇంజినీరింగ్ అద్భుతాల ఆవిష్కరణలో ఆస్ట్రియాకు అపార అనుభవం ఉంది. ఇది భారతదేశంలో అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎంతో దోహదం పడింది. హిమాలయాల్లో 10వేల అడుగుల ఎత్తులో అటల్ టన్నెల్‌ను నిర్మించారు. ఇప్పుడు కూడా ఎన్నో భారత మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఆస్ట్రియన్ కంపెనీల భాగస్వామ్యం ఉంది" అని ప్రధాని తెలిపారు.

**ఆ 3 విభాగాల్లో కలిసి పనిచేస్తాం : స్టాకర్**

భారత్, ఆస్ట్రియాలు వాణిజ్యం, టెక్నాలజీ, హరిత ఇంధనం వంటి విభాగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకుంటాయని ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ వెల్లడించారు. దీనివల్ల ఇరుదేశాల ప్రజలు, వ్యాపారాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయన్నారు. భవిష్యత్తులో ఈయూ-భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు సహా అన్ని విభాగాల్లోనూ కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన తెలిపారు. గత 4 దశాబ్దాల్లో భారత్‌లో పర్యటించిన తొలి ఆస్ట్రియా ఛాన్స్‌లర్‌ను తానేనని స్టాకర్ చెప్పారు. 75 ఏళ్ల చరిత్ర కలిగిన భారత్ - ఆస్ట్రియా స్నేహంలో మరో కొత్త అధ్యాయాన్ని మొదలుపెడుతున్నామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు పెరుగుతున్న ఈ తరుణంలో ఉమ్మడి విలువల ప్రాతిపదికన భారత్, ఆస్ట్రియా లాంటి విశ్వసనీయ దేశాలు చేతులు కలుపుతున్నాయని ఆయన తెలిపారు. తనను భారత్‌కు ఆహ్వానించినందుకు, గొప్ప ఆతిథ్యాన్ని అందించినందుకు ప్రధాని మోదీకి స్టాకర్ ధన్యవాదాలు చెప్పారు. ఈమేరకు సందేశాలతో ఆయన ట్వీట్లు చేశారు.

**మహాత్మాగాంధీకి స్టాకర్ నివాళులు**

ప్రధాని మోదీతో భేటీకి ముందు, ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. ఈవివరాలతో భారత విదేశాంగ శాఖ ఒక ట్వీట్ చేసింది. దీని ప్రకారం మోదీ, స్టాకర్‌ల ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులు, కల్చరల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలపై చర్చించారు.

# లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ముందుకు మూడు కీలక బిల్లులు వచ్చాయి. దేశంలో మహిళా రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్రం తీసుకొచ్చిన మూడు కీలక బిల్లులపై లోక్ సభలో వాడీవేడి చర్చ జరిగింది. మొదట ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తప్పుపట్టాయి. విపక్షాల వాదనను అధికార పక్షం తోసిపుచ్చింది. ఈ క్రమంలో రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్??లో ప్రభుత్వానికి అనుకూలంగా మెజార్టీ వచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ నెలకొంది.

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టిన మేఘ్వాల్ మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ఆయన సభ ముందుకు తీసుకొచ్చారు. అంతకుముందు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు.

"ఈ రోజు పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైంది. 2023లోనే నారీశక్తి వందన్ అధినియం బిల్లును ఆమోదం పొందింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందగా, ఇప్పుడు వాటిని అమలు చేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 (2) ప్రకారం ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవచ్చు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలకు పార్లమెంటుకు రాజ్యాంగం శక్తి ఇచ్చింది. ఈ క్రమంలోనే మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. బిల్లు ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. మహిళలకు సామాజిక న్యాయం కోసం కేంద్రం అనేక పథకాలు తెచ్చింది. మహిళలకు శౌచాలయాలు, ఉజ్వల యోజన అమలు చేశాం. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం జరగాల్సిందే. మహిళలకు జన్‌ధన్ ఖాతాలు, పీఎం ముద్రా యోజన అమలు చేశాం. సుకన్య సమృద్ధి యోజన, లఖ్‌పతీ దీదీ వంటి పథకాలు అమలు చేశాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత నిచ్చాం."

**131వ రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన పలు పార్టీలు**

అయితే 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, టీఎంసీ, కేరళ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, వీ×వీ, జూ×, ఇతర విపక్షాలు బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం బుల్డోజ్ చేస్తోందని మండిపడ్డాయి. "అప్రజాస్వామిక బిల్లును ఉపసంహరించుకోవాలి. జనాభా గణనపై ప్రభుత్వం ఎందుకు ఆసక్తి చూపట్లేదు? కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముస్లింలను మినహాయిస్తోంది. మూడు బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలి." అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు.

**విపక్షాల ఆరోపణలకు అమిత్ షా కౌంటర్?**

ఈ క్రమంలోనే విపక్షాల ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలున్నాయని ఆయన మండిపడ్డారు. జనగణన ఎందుకు చేపట్టలేదని విపక్షాలు చెప్పడం సరికాదన్న ఆయన, ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యిందని వివరించారు. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోందని, ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదని పేర్కొన్నారు. వ్యక్తుల గణన సమయంలో జాతి ప్రస్తావన ఉంటుందని స్పష్టం చేశారు.

**మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్**

అనంతరం రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలా వద్దా అనే అంశంపై విపక్షాలు డివిజన్ కోరాయి. ఆ మేరకు జరిగిన ఓటింగ్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 మంది ఓటు వేశారు. బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ 185 మంది సభ్యులు ఓటేశారు. ఫలితంగా విపక్షాల డివిజన్ వీగిపోయింది. రాజ్యాంగ సవరణ బిల్లుతో కలిపి రెండు సాధారణ బిల్లులను తీసుకురావడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టగా ప్రభుత్వం ఆ వాదనని తోసిపుచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై స్పీకర్ చర్చకు అనుమతిచ్చారు. ఓటింగ్‌కు ముందు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరుగుతుందని లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చని, సభలో సభ్యులందరికీ సమయం ఇస్తామని చెప్పారు. ఈ మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని తెలిపారు.

## జనగణన ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

-మొదటిపేజీ తరువాయి

కూడిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ముఖ్యమంత్రికి రాష్ట్ర జనగణన డైరెక్టర్ జె.నివాస్ వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. మే ఒకటో తేదీ నుంచి 30 వరకూ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా జనగణన చేపడతారని చంద్రబాబుకు తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు... 'పౌరులందరికీ సమానంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించాలి. సరైన వివరాలు నమోదు చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రజలు సహకరించాలి' అని కోరారు.

## మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉంది

-మొదటిపేజీ తరువాయి

చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. "మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

## ముఖ్యమైన ప్రాజెక్టులు గుర్తించండి

-మొదటిపేజీ తరువాయి

విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, గత పాలకుల నిర్ణయాల వల్ల తలెత్తిన రూ.4,600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. ప్రజలపై ఎలాంటి భారం వేయకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు.

**ఆ ప్రాజెక్టులు పూర్తయితే సంపద సృష్టి**

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత లేదని, కేంద్రం సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని చెప్పారు. "పూర్వోదయ, సాస్కి వంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలి. సంక్షేమ క్యాలెండర్‌కు అనుగుణంగానే పథకాలు అమలు చేస్తాం. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలి" అని నిర్దేశించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దాక్షిణ్యంగా మూసేశారని, ఎన్ని ఇబ్బందులున్నా అన్నార్తుల కడుపు నింపేలా రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యంతోపాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌తో వీహెచ్‌పీ నేతల భేటీ..

-మొదటిపేజీ తరువాయి

దుర్గా ప్రసాద్ రాజు, ఏపీ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ ఉన్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో డ్రగ్స్‌పై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల తరహాలోనే, అక్రమ గోరవాణా, గోవధపై కూడా ఉక్కుపాదం మోపాలని వారు విజ్ఞప్తి చేశారు. గోసంరక్షణ కోసం మరిన్ని గోశాలల నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. దేవాలయాల నిర్వహణ, భూముల పరిరక్షణపై కూడా వారు పలు సూచనలు చేశారు. ఆలయాలను కేవలం పూజా స్థలాలుగానే కాకుండా, ధార్మిక ప్రచారం, సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా మార్చాలని సూచించారు. ధార్మికతకు భంగం కలగకుండా ఆలయ భూములపై ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని కోరారు. దీర్ఘకాలిక లీజు విధానాన్ని సవరించాలని, అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకుని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో హిందువులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే తొలగించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో పూర్తిస్థాయి ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయాలని సూచించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు. గత ప్రభుత్వంలో హిందూ భక్తులపై పెట్టిన అక్రమ కేసులను కచ్చితంగా తొలగిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. హిందూ ధర్మ పరిరక్షణకు, ధార్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. హిందూ సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు వీహెచ్‌పీ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## మహిళా సాధికారతకు చరిత్రాత్మక అడుగు వేసేందుకు సిద్ధం

మహిళా సాధికారత దిశగా దేశం కీలక ముందడుగు వేయబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు, తల్లులు, సోదరీమణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవమని అన్నారు. మూడు రోజుల పాటు పార్లమెంట్లో జరగనున్న ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టనున్న సందర్భంగా ప్రధాని మోదీ ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

## శాంతి చర్చలు విఫలమైతే మళ్లీ యుద్ధం తప్పదు..

అమెరికా, ఇరాన్ మధ్య రెండో దశ శాంతి చర్చలు జరగబోతున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్ వేదికగా రెండో దశ శాంతి చర్చలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ కు అమెరికా తాజాగా మరో హెచ్చరిక జారీ చేసింది. ఈసారి శాంతి చర్చలు విఫలమైతే యుద్ధం చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని హెచ్చరించారు. యుద్ధాన్ని తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సిద్ధమవుతున్నామని అమెరికా రక్షణ శాఖ సెక్రెటరీ పీట్ । హెగ్సెత్ అన్నారు. ఇరాన్ ప్రతి కదలికనూ గమనిస్తున్నామని పేర్కొన్నారు. "అమెరికా నిఘా సంస్థలు ఇరాన్ ప్రతి కదలికనూ గమనిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ సైనిక చర్యలపై నిఘా ఉంది. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ అమెరికా దళాలు యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి. గతంలోకంటే ఇప్పుడు యుద్ధానికి ఇంకా బలంగా సిద్ధమవుతున్నాం. మేం ఎనర్జీ సెక్టార్ను ఇంకా ధ్వంసం చేయలేదు. హార్ముజ్ దిగ్బంధనంతో ఎగుమతులు నిలిచిపోయాయి. త్వరగా అమెరికాతో ఇరాన్ ఒప్పందం కుదుర్చుకుంటుందని ఆశిస్తున్నాం. శాంతి చర్చలు విఫలమైతే తిరిగి యుద్ధం తప్పదు.

# వైసీపీ కి అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరు చింతమనేని





**దెందులూరు, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** ఈ తరం అంతా మన కూటమిదే అధికారం, రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కూటమికే ప్రజల ఆశీర్వాదం, మరోసారి వైసీపీ వంటి అక్రమార్కులకు అరాచక శక్తులకు అధికారం ఇచ్చేందుకు విజ్ఞత కలిగిన ఏ ప్రజలు కూడా సిద్ధంగా లేరు, గ్రామాల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని భవిష్యత్తు అవసరాలను సైతం దృష్టిలో ఉంచుకుని మనం పనిచేయాలి కూటమి నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, సిబ్బందికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచనలు.

దెందులూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన దెందులూరు, పెదవేగి మండలాల అభివృద్ధి పనుల పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దెందులూరు, పెదవేగి మండలాల్లోని పలు గ్రామాల్లో త్రాగునీటి సరఫరాలో సమస్యలు, వాటిని మెరుగు పరిచేందుకు జల్జీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల అంశాల పై ఎమ్మెల్యే చింతమనేని సుదీర్ఘంగా సమీక్షించారు. ఏ ఏ గ్రామాల్లో ఓవర్హెడ్ రిజర్వాయర్ సిస్టం ఓహెచ్ఆర్ఎస్ (వాటర్ ట్యాంకుల) అవసరాలు ఉన్నాయో వాటి అంచనాలను సిద్ధం చేయాలని, జనాభా ప్రాతిపదికన ఈ ఓహెచ్ఆర్ఎస్ల ను ఎంపిక చేయాలని, అదే విధంగా అనేక గ్రామాల్లో మూడు దశాబ్దాల పైగా కాలం చెల్లిన పైప్ లైన్ నిర్మాణాల విషయంలో అనేకచోట్ల తీవ్రంగా మరమ్మత్తులు ఏర్పడుతున్నాయని, అటువంటి అంశాల్లో వాటిని మార్చేందుకు కూడా అంచనాలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని సంబంధిత గ్రామపంచాయతీ ల ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు చింతమనేని సూచించారు. ఈ విధంగా గ్రామ పంచాయతీల నుంచి ఆయా గ్రామాల పరిధిలో చేపట్టవలసిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టవలసిన పనుల నివేదికలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందజేసి వాటిని మంజూరు అయ్యేలా చూడవలసిందిగా నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి ఎమ్మెల్యే సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పై మండలాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గారపాటి రామసీత, జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఆర్డబ్ల్యుఎస్ డిఈ, దెందులూరు ఎమ్మార్వో బత్తిన సుమతి, ఎంపీడీవో ప్రతాప్, పెదవేగి ఎమ్మార్వో భ్రమరాంబ, ఎంపీడీవో నాగేంద్ర, మండల పార్టీల అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, మరడాని రవి, నంబూరి నాగరాజు, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, దెందులూరు సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, విజయ్ రాయి సొసైటీ చైర్మన్ బొప్పన సుధా, జోగన్న పాలెం సొసైటీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు, పోతునూరు సొసైటీ చైర్మన్ బొడ్డేటి మోహన్, గాలయిగూడెం సొసైటీ చైర్మన్ పూజారి వెంకటరత్నం నాయుడు, సీతంపేట సొసైటీ చైర్మన్ యలమర్తి సత్యనారాయణ, గంగన్నగూడెం సొసైటీ చైర్మన్ కూచిపూడి కిషోర్, దెందులూరు నీటి సంఘం అధ్యక్షులు వెలమాటి రాంబాబు సహా కూటమి నాయకులు గుత్తా అనిల్, కమ్మ శివరామకృష్ణ, పరస వెంకటరావు, ఎలమర్తి శ్రీనివాస్, పర్వత నేనీ రామకృష్ణ, మంచినేని శ్రీనివాస్, తిలక్ , నేతల రవి , దశరధ రామయ్య, సత్యనారాయణపురం బుజ్జి, బాయి రాంప్రసాద్ సహా వివిధ హోదాల్లోని కూటమి నాయకులు , క్లస్టర్ ఇంచార్జీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహిళా బిల్లుకు మద్దతుగా దిల్లీలో ఏపీ మహిళా ప్రతినిధుల సందడి





**న్యూ దిల్లీ, ఏప్రిల్ 16:** నేడు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో 33 శాతం రిజర్వేషన్లతో మహిళా బిల్లును ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం. భారత ప్రజాస్వామ్యంలో సువర్ణాక్షరాలతో నిలిచిపోనుంది.

పార్లమెంట్ లో మహిళా బిల్లు పై జరిగే చర్చను వీక్షించనున్న మంత్రి సవిత నేతృత్వంలో ఏపీ మహిళా ప్రతినిధులు.

మంత్రి సవితతో పాటు మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి సహా పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. న్యూ దిల్లీ లో వచ్చిన మంత్రులు సవిత, అనిత, సంధ్యారాణి సహా ఇతర మహిళా ఎమ్మెల్యేలకు గురువారం ఉదయం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అతిథ్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్‌లో 100% ప్లేస్ మెంట్లు.

- 132 మంది విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ





**గన్నవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవం, జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాలలో నాలుగు విభాగాలకు చెందిన మొత్తం 132 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడంతో 100 శాతం ప్లేస్ మెంట్లు నమోదయ్యాయి. గతంలో కొన్ని బ్రాంచ్‌లకు పరిమిత మైన అవకాశాలు ఉండగా, ఈసారి అన్ని విభాగాల్లోనూ పూర్తి స్థాయి ప్లేస్‌మెంట్లు సాధించడం విశేషంగా నిలిచింది. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసి, అభినందించారు. కృషి, పట్టుదలతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరానికి సి-డాక్ సంస్థను తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే, మేధా టవర్‌లో క్వాంటం వ్యాలీ రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వచ్చే నెల నుంచి హెచ్‌సిఎల్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కళాశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, రూ.30 లక్షల నిధుల కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కోరినట్లు తెలిపారు. కంప్యూటర్ల కోసం ఓఎన్‌జీసీతో చర్చలు జరుగుతున్నాయని, కాలేజీ మౌలిక వసతులను మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్, ఐటీఐ చదువులు పూర్తి చేసిన వారికి తక్కువ వయసు లోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, యువత ఈ అవకాశాలను వినియోగించు కోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సపాల్ వివి కృష్ణమోహన్, సిఐ బివి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# పర్యాటక కేంద్రాలను ప్రారంభించిన సుందరపు





**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** మండలం లోని కొండకర్ల ఆవలో గురువారం ఏషియన్ పెయింట్స్ సంస్థ సౌజన్యంతో పర్యాటకంగా అభివృద్ధి చేసిన సెల్ఫీ పాయింట్, ఐ లవ్ కొండకర్ల వంటి ఫోటో స్పాట్ లను ప్రారంభించిన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ యాజమాన్యం నియోజకవర్గ వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వారి సేవలను కొనియాడారు. అదే విధంగా నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతంగా కొండకర్లను ఇప్పటికే జిల్లా ఉత్సవాలను ఇక్కడే ప్రారంభించామని, అదే విధంగా నేడు అనేక అభివృద్ధి పనులను ప్రారంభించడం హర్షణీయమన్నారు. నియోజకవర్గంలో తంతడి, రాంబిల్లి, సీతపాలెం వంటి ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ యాజమాన్యం, కూటమి నాయకులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.







## జనగణన లో నమోదు చేసుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్.



**అచ్చుతాపురం, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన-2027 ప్రక్రియలో భాగంగా, యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గురువారం నాడు అచ్యుతాపురం మండలం మూసాయిపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంగా స్వీయ గణన చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నేటి నుండి (ఏప్రిల్ 16) ప్రారంభ మైన ఇళ్ల జాబితా, ఇళ్ల గణన తొలి విడత కార్యక్రమంలో భాగంగా, ఆయన అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి తన కుటుంబ వివరాలను స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా యలమంచిలి నియోజవర్గం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ గణనలో పాల్గొని దేశాభివృద్ధికి సహకరించాలని పిలుపు నిచ్చారు. ప్రజలే తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈ స్వీయ గణన అద్భుత మైన అవకాశమని, దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా కచ్చిత మైన వివరాలు నమోదవు అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుండి 30 వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ డిజిటల్ విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, నమోదు పూర్తి చేసిన తర్వాత వచ్చే ఐడీ (ఐడి)ని భద్రపరుచు కోవాలని సూచించారు. మే 1 వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తారని, ఆ సమయంలో ఈ ఐడీని వారికి చూపించాల్సి ఉంటుందని తెలిపారు. తప్పుడు సమాచారం నమోదు చేయకుండా, వాస్తవ వివరాలతో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అధికారులు తదితరులు. పాల్గొని స్వీయ గణన ప్రక్రియను పర్యవేక్షించారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలి.

★ ఇంటర్మీడియట్ ఫలితాల పై కళాశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్.






**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఫలితాలు తక్కువగా వచ్చిన సబ్జెక్టుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల నేపథ్యంలో గురువారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో కస్తూరీభా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్ స్కూల్స్, సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల, సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించిన పాఠశాలలను అభినందించారు. తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నమోదైన ఉత్తీర్ణత శాతాన్ని గత ఏడాదితో పోల్చి చూశారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం త్వరలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల దృష్ట్యా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు సాధించని విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా, వారికి మానసిక, మనో ధైర్యాన్ని ఇచ్చేందుకు కౌన్సెలింగ్ సెషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని, 100% ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు జి.అప్పారావు నాయుడు, వినోద్ బాబు, జిల్లా సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల, సంక్షేమ శాఖ అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సంబంధిత అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య జాతరలో 5 వేల మంది మహిళలతో బారీ ఘటాల ఊరేగింపు







**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న కొత్త అమావాస్య, రాష్ట్ర జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి నెల పండుగ జాతర సందర్భంగా పట్టణములో అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి సుమారు 5,000 మంది మహిళలు ఘటాలు ఊరేగింపులో పాల్గొన్నారు. విశాఖపట్నం నుండి హరి తేజ లక్ష్మి కోలాట బృందం సభ్యుల కోలాటం భక్తులు అకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఘటాల ఊరేగింపు నేల వేషాలు, నెమలి ఈకలతో, కోలాటాలతో ప్రత్యేక రథం పై అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. పట్టణములో పురవీధులో తిరుగుతూ అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, శ్రీ గౌరీ సేవా సంఘం పాలకవర్గ సభ్యులు ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, కూటమి నాయకులు, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి--అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులకు హైకోర్టు ఊరట



★ టిడిఆర్ బాండ్లు కాదు,నగదు పరిహారమే.
★ కాంక్రీట్ గోడల నిర్మాణం నిలిపివేయాలి.
★ వైఎస్ఆర్సిపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్

**మునగపాక, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రోడ్డు నిర్వాసితులు, రైతులకు హైకోర్టు ఇచ్చిన తీర్పు ఊరటనిచ్చిందని వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. మండలం లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు టిడిఆర్ బాండ్ల రూపంలో కాకుండా, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు రూపం లోనే నష్టపరిహారం చెల్లించాలి అని హైకోర్టు స్పష్టంగా ఆదేశించిందని చెప్పారు. అనకాపల్లి--అచ్యుతాపురం రోడ్డు పరిధిలో సుమారు 2,000 ఎకరాల పంట భూములు ప్రభావితమవుతున్నాయని, ముఖ్యంగా మునగపాక, గంగాదేవిపేట, ఒంపోలు గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గంగాదేవిపేట జంక్షన్ నుంచి మునగపాక జంక్షన్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములు వరద ముప్పుకు గురయ్యే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు వర్షాకాలంలో పంటలను రక్షించుకునేందుకు రైతులు స్వచ్ఛందంగా సొలోపు కాలువలను మరమ్మతు చేసుకుని, ఆ నీటిని మునగపాక కృష్ణంరాజు కాలువకు చేరేలా చూసుకుంటున్నారని చెప్పారు. అయితే భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాకుండానే, ఎటువంటి నష్టపరిహారం చెల్లించ కుండా రోడ్డుకు ఇరువైపులా కాంక్రీట్ గోడల నిర్మాణం చేపడుతున్నారని విమర్శించారు. ఈ కాంక్రీట్ గోడలు నిర్మించబడితే, రాబోయే రోజుల్లో వరదలు సంభవించినప్పుడు పంట పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల వెంటనే ఆ నిర్మాణాలను నిలిపివేసి, ముందుగా రైతులకు చట్టప్రకారం నగదు పరిహారం చెల్లించి, భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని బొడ్డేడ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం వైఎస్సార్సీపీ ఎప్పుడూ పోరాడుతుందని, బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునగపాక మండలం జడ్పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ, మునగపాక మండలం పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, మాల సంఘం అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, రోడ్డు నిర్వాసితులకు బాధిత, రైతుల తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులను అభినందించిన రత్నాకర్

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** ఇటీవల విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను పొందారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈసి విభాగంలో పి రేష్మ శ్రీ 490 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ పొందడం జరిగింది. ఎంపీసీ విభాగంలో జి సంజన 487, బి లహరి 464, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి ఆనందిత 978, ఎం ఇ సి లో బి ప్రహర్షిని 963, బైపీసీలో ఎస్ లక్ష్మీ చిన్మయి 445 మార్కులతో అనకాపల్లి జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి విద్యార్థి వీరిని ఆదర్శంగా తీసుకొని విద్యలో ఉత్తమ ఫలితాలను సాధిస్తూ కళాశాలకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి అప్పలనాయుడు, జగదీష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో అవగాహన కోసం విస్తృత తనిఖీ



**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** పోలీస్ స్టేషన్ పరిధి లోని దేశపాత్రునిపాలెం రోడ్డు పై వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించ బడినవి. రోడ్డు భద్రతను పెంపొందించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టబడినవి. తనిఖీల సందర్భంగా ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించడ మైనది. అదే సమయంలో వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యత, లైసెన్స్ తప్పనిసరి అంశాలపై అవగాహన కల్పించడ మైనది. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, వాహనం నడిపే ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి అని సూచించడ మైనది.

ఇలాంటి రోడ్డు భద్రత తనిఖీలు పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం విస్తృతంగా కొనసాగించ బడతాయని, ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలను పాటించి, పోలీసులకు సహకరించవలసిందిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ కోరడమైనది.

# మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభం.

## ఫైజర్ ఫార్మా సి.ఎస్.ఆర్ ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలకు కొత్త దిశ ఎంపీపీ పయిల





**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** మండలంలో మాతా శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఫైజర్ ఫార్మా సి.ఎస్.ఆర్ ద్వారా మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ (1000 డేస్ ప్రోగ్రామ్) ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. పరవాడ గ్రామం లోని డి.ఎఫ్.వై జన సేవత్ క్లినిక్ లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని పరవాడ మండల ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెయిల కు సంస్థ హెడ్ కట్టా రవి చందర్, కంపెనీ యాజమాన్యం దుశ్శాలువ సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరి రక్షణలో ఇలాంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గర్భధారణ సమయంలో సరైన వైద్య సేవలు, పోషకాహారం, సమయానుకూల పరీక్షలు ఎంతో ముఖ్యమని, ఈ కేంద్రం ద్వారా గ్రామ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు లోకి రావడం సంతోషకరమని తెలిపారు. ముఖ్యంగా 1000 రోజుల ప్రోగ్రామ్ అనేది తల్లి గర్భధారణ ప్రారంభం నుంచి, చిన్నారి రెండేళ్లు పూర్తి అయ్యే వరకు అత్యంత కీలకమైన దశగా భావిస్తారని, ఈ కాలంలో సరైన ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, టీకాలు, వైద్య సలహాలు అందించడం ద్వారా తల్లి-బిడ్డ ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆమె వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ స్థాయిలో అమలు కావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రముఖ ఔషధ సంస్థ ఫైజర్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కార్యక్రమం కింద నిర్వహించబడగా, డాక్టర్స్ ఫర్ యూ సంస్థ ఆధ్వర్యంలో అమలు చేయబడుతోంది అని అన్నారు. ఈ మాతా--శిశు ఆరోగ్య కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలకు ముందస్తు (అంటేనేటల్) ప్రసవానంతర (పోస్టునాటల్) సేవలు, నవజాత శిశువులకు ప్రత్యేక సంరక్షణ, టీకాల మద్దతు, పోషకాహార సలహాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు అందించ బడనున్నాయి. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మాతా--శిశు మరణాల రేటును తగ్గించడంలో ఇలాంటి కేంద్రాలు కీలకంగా మారుతాయని తెలిపారు. సమయానికి వైద్య పరీక్షలు, సరైన ఆహారం, టీకాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు.

కేంద్రం ప్రారంభంతో పరవాడ మండల ప్రజలకు, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారులకు సమీపం లోనే నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటు లోకి రావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం గ్రామీణ ఆరోగ్య రంగంలో ఒక కొత్త దిశగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. చివరగా, ఈ కేంద్రం విజయవంతంగా నడవడానికి ప్రజలు సహకరించాలని, అందరూ ఆరోగ్య సేవలను వినియోగించు కోవాలని నిర్వాహకులు కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా ప్రతినిధులు, సైట్ హెడ్ కట్టా రవి చందర్, పరవాడ మాజీ సర్పంచ్ సిరిపురపు అప్పల




నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వైద్య నిపుణులు, డాక్టర్స్ ఫర్ యూ సంస్థ ప్రతినిధులు, మహిళలు, గర్భిణులు, ఆశ వర్కర్లు, పి.హెచ్.సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గూడుపమ్మ తల్లిని దర్శించుకున్న వెంకటేష్

**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 16:**మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి ఆలయాన్ని గురువారం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ దంపతులు విశాఖపట్నం నకు చెందిన నమ్మి గాయత్రి, చంద్రకళ, సూర్య కుమారి తదితరులు
దర్శించుకున్నారు.. ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి పసుపు, కుంకుమలు సమర్పించారు. రేబాక కూటమి నాయకులు కరణం సూరిబాబు, సాదిరెడ్డి వర ప్రసాద్, గంట్యాడ రమేష్, కర్రి నాగేశ్వరరావు, కసిరెడ్డి అప్పారావు ( బుజ్జి ), సాదిరెడ్డి రాజు, సాదిరెడ్డి నాగేష్,చెవ్వాకుల సూరిబాబు, తదితరులు అమ్మవారి శేష వస్త్రంతో వెంకటేష్, హేమ దంపతులను సత్కరించారు.



# అమలాపురంలో వైభవంగా అమ్మవార్ల పండగ





**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** మండలంలో అమలాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కనకమహాలక్ష్మి, బంగారమ్మ, నూకాలమ్మ తల్లి అమ్మవార్ల పండగ అంగరంగ వైభవంగా జరుగుతుంది. గంధం అమావాస్య ను పురస్కరించుకొని ఈ అమ్మవార్ల పండుగను ఘనంగా నిర్వహిస్తారు. గురువారం వైయస్సార్సీపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు గొర్ల గోవిందు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు,ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, స్థానిక నాయకులు సూరకాసుల గోవిందు, తల్లా భార్గవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు. దీనిలో భాగంగా అమ్మ వారిని స్థానికులతో పాటు సమీప గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద తీన్మార్, కోలాటం వంటి కార్యక్రమాలతో ఆలయం వద్ద సందడి నెలకుంది. పెద్దఎత్తున బాణసంచా పేల్చారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవాళ్ళు దర్శనంకి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు సమకూర్చారు.

# ఒక నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- **రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఏసీపీ సారంగపాణి హెచ్చరిక**

**పెన్ సత్తా, ఏప్రిల్ 16:**రోడ్డు మీద వాహనం నడిపేటప్పుడు చేసే చిన్న నిర్లక్ష్యం కూడా నిండు ప్రాణాలను బలిగొనాల్సిన పరిస్థితి తీసుకురాగలదని వైరా ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన “ూతీతీఅజవ ూశ్రీఅజవ =శ్రీుఽ ఝుటవ్ఎ ఝుఎఝుఝుఅస్త్రఅ--2006” కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మండలంలోని బసాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఏసీపీ సారంగపాణి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగవని, వాటిలో ఎక్కువ భాగం డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క క్షణం అజాగ్రత్త ఒక కుటుంబాన్ని జీవితాంతం విషాదంలో ముంచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ పెట్టుకోవడం మాత్రమే కాకుండా దాని పట్టీ బిగించుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ప్రమాద సమయంలో తలను రక్షించేది హెల్మెట్ మాత్రమేనని, అది ప్రాణాలకు కవచంలాంటిదని తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి చర్యలు కేవలం మన ప్రాణాలనే కాదు, ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అధిక వేగంతో వాహనం నడపడం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు.

# కర్ణాటక రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య పై చర్య తీసుకోండి

- **బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉప్పు కృష్ణ డిమాండ్**




పెన్ సత్తా, ఏప్రిల్ 16:పార్లమెంటు సాక్షిగా భారతదేశం పాకిస్తాన్ విభజించినట్టుగా ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రాన్ని వేరు చేశారని కర్ణాటక రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడడం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని ఉప్పు కృష్ణ అన్నారు. ఆయన మాటలు తెలంగాణ ప్రజలను అవమానించే విధంగా ఉన్నాయని, తెలంగాణ ప్రజలకు బెషారత్ గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ ఆయన చేశారు. బిజెపి అధిష్ఠానం సదరు ఎంపీపై బహిష్కరణ వేటు వేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ దేశాన్ని విభజించు పాలించు అనే పద్ధతిలో పరిపాలన చేస్తున్నటువంటి బిజెపి, బిజెపి నాయకత్వం తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలను ఇస్తే ఒక్క ఎక్స్ప్రెస్ హైవే ఇవ్వకుండా ఒక పెద్ద ప్రాజెక్టులు పెట్టకుండా వివక్షత చూపించడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రజలను అవమానించే విధంగా మాట్లాడితే సహించేది లేదని బిజెపికి తెలంగాణలో తగిన గుణపాఠం తప్పదని ఉప్పు కృష్ణ హెచ్చరించారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్రంపై చేసినటువంటి వాక్యాలు అభ్యంతరకరమని అవమానకరమనీ ఆయన రాజకీయ అవగాహన లేని తనానికి సంకేతం అని ఉప్పు కృష్ణ అన్నారు.

# జననేత మహమ్మద్ జావీద్ గారి మరణంపై డా. పీటర్ నాయక్ లకావత్ ప్రగాఢ సానుభూతి



పెన్ సత్తా, ఏప్రిల్ 16:ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ జావీద్ గారి మరణం పట్ల తీవ్ర విషాదం వ్యక్తమవుతోంది. ఆయన మృతి ప్రజా జీవనానికి, రాజకీయ రంగానికి ఒక అపూర్వ లోటుగా భావించబడుతోంది.


ఈ నేపథ్యంలో, ఇంటర్నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ డా. పీటర్ నాయక్ లకావత్ గారు స్పందిస్తూ, జావీద్ గారి మరణంపై ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

సమాజానికి సేవ చేయడంలో ఆయన చూపిన అంకితభావం, ప్రజలతో కలిసిపోయే స్వభావం, రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని పేర్కొన్నారు. జావీద్ గారి వంటి నిస్వార్థ నాయకుడిని కోల్పోవడం సమాజానికి తీరని లోటని అభివర్ణించారు.

ఈ దుర్ఘటనలో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి ధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# ఉపమాక ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో చలపతిరావు

ఘన స్వాగతం పలికిన కూటమి నాయకులు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 16:** మండలంలో ఉపమాక గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో చలపతిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పుష్పగుచ్చాలు, దుస్సాల్వాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి చలపతిరావు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు గ్రామస్తులు స్థానిక నాయకులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, స్థానిక నాయకులు జగదీష్, తోలేటి శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో ప్రపంచం

అభివృద్ధి చెందిన, చెందుతున్న ఆర్థికవ్యవస్థలలో ద్రవ్యపరమైన ఒత్తిళ్లు తీవ్రమవుతున్నందున, ప్రపంచ దేశాల అప్పులు ఆందోళనకర స్థాయికి పెరగనున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) హెచ్చరించింది. 2029 నాటికి ఇది ప్రపంచ జీడీపీలో 100 శాతానికి చేరవచ్చని అంచనా చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులు క్రమంగా క్షీణిస్తున్నాయి. 2025 నాటికే ప్రపంచ రుణం జీడీపీలో సుమారు 94 శాతానికి చేరింది. నిరంతర లోటు, పెరిగిన వడ్డీ ఖర్చులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దీనికి ప్రధాన కారణాలని ఐఎంఎఫ్ పేర్కొంది. అవి ఇంకా పెరుగుతూనే ఉంటాయని అంచనా. ఇటీవలి పశ్చిమాసియా ఘర్షణలు, భౌగోళిక సమస్యలు ఇంధన ధరలను పెంచి ప్రపంచ ఆర్థిక పరిస్థితులను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహార, ఇంధన ధరలు కూడా పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ముఖ్యంగా దిగుమతి ఆధారిత, తక్కువ ఆదాయ దేశాలపై ఎక్కువగా పడుతోంది. తద్వారా ఈ దేశాలు అధిక ఖర్చులు, పరిమిత ఆర్థిక వెసులుబాటు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అయితే, ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్‌తో పాటు మెక్సికో, టర్కీ వంటి దేశాలు కొంత మెరుగైన ఆర్థిక స్థితిలో ఉన్నాయి. భారత్‌లో ఖర్చుల నియంత్రణ సరిగ్గానే ఉందని, అత్యంత పటిష్టమైన వృద్ధి ఇందుకు కారణమని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. భారత రుణ–జీడీపీ నిష్పత్తి ఇంకా 84 శాతం కంటే ఎక్కువగా ఉంది. మనదేశం తర్వాత మధ్యస్థంగా అప్పుల భారం ఉన్న దేశాల్లో బ్రెజిల్(90 శాతం), చైనా(100 శాతం), యూకే(105 శాతం), కెనడా(105 శాతం), స్పెయిన్(110 శాతం) ఉన్నాయి. అంతర్జాతీయ సంక్షోభాలు కొనసాగితే ఇంధన ధరలు, నిధులు, ఆర్థిక నిర్వహణపై ఒత్తిడి పెరుగుతుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. గత దశాబ్దంతో పోలిస్తే అదనంగా డబ్బు ఖర్చు చేయడానికి లేదా




అప్పు తీసుకోవడానికి ఉన్న సామర్థ్యం ప్రపంచ దేశాల్లో చాలా తగ్గిపోయింది. ప్రస్తుతం చాలా దేశాలు అధిక వడ్డీ రేట్లతో రుణాలు తీసుకోవాల్సి వస్తోంది, దీంతో వడ్డీ భారం వేగంగా పెరుగుతోంది. జపాన్(జీడీపీలో 240 శాతం అప్పుల భారం), సింగపూర్(180 శాతం), గ్రీస్(170 శాతం), ఇటలీ(145 శాతం), అమెరికా(125 శాతం) దేశాలు భారీ అప్పులను ఎదుర్కొంటున్నాయి. రష్యా, సౌదీ అరేబియా, యూఏఈ, ఆస్ట్రేలియా, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు 20–65 శాతం మధ్య తక్కువ రుణాలు కలిగి ఉన్నాయి.

# రాటెత్తిన టోకు ధరలు

దేశంలో ధరలు రాటెత్తుతు సామాన్యుడి నడ్డి విరుస్తోన్నాయి. ఈ ఏడాది మార్చిలో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 4 శాతం చేరువకు ఎగిసింది. ఇది గత మూడేళ్లలోనే అత్యధికంగా కావడం ఆందోళకరం. బుధవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చిలో డబ్ల్యుపిఐ 3.88 శాతానికి చేరింది. ఇది 38 నెలల గరిష్ట స్థాయి. ఇంతక్రితం ఫిబ్రవరిలో 2.13 శాతంగా ఉన్న ఈ ధరల సూచీ.. కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారీగా ఎగబాకడం తీవ్ర ఆందోళనకరం. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడమే దీనికి ప్రధాన కారణమని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. మార్చి నెలలో ముడి చమురు ధరలు ఏకంగా 51.57 శాతం మేర పెరగడమే ధరల మంటకు ప్రధాన కారణం. ఇది సామాన్యుడి రవాణా బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేసింది. గత ఏడాది కాలంగా ప్రతికూల దిశలో ఉన్న ఇంధనం, విద్యుత్ విభాగం ద్రవ్యోల్బణం ఇప్పుడు 1.05 శాతానికి చేరడం భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయనడానికి హెచ్చరికగా మారింది. సామాన్యుడు ఎక్కువగా ఉపయోగించే నూనె గింజల ద్రవ్యోల్బణం 22.81 శాతం పెరగడం గమనార్హం. దీంతో వంట నూనెల ధరలు భారంగా మారాయి. డబ్ల్యుపిఐలో 64 శాతానికి పైగా వాటా ఉన్న తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మార్చిలో 3.39 శాతానికి చేరుకుని 40 నెలల గరిష్ట స్థాయి కావడం గమనార్హం. ఫిబ్రవరిలో ఇది 2.92 శాతంగా ఉంది. ఇదే నెలలో 3.21 శాతంగా ఉన్న రిటైల్ ఆహార ద్రవ్యోల్బణం.. మార్చిలో ఇంధన ధరల పెరుగుదల కారణంగా 3.4 శాతానికి పెరిగింది. మరోవైపు వినియోగదారుల ధరల సూచీ 3.40 శాతానికి చేరింది. ఆదాయాలు హరించుకుపోతున్న తరుణంలో అధిక ధరల వల్ల




సామాన్యుడి వాస్తవ ఆదాయం తగ్గుముఖం పడుతోంది. దీంతో గతంలో వంద రూపాయలకు వచ్చే సరుకులు ఇప్పుడు సగం కూడా రావడం లేదు. వర్షాభావ పరిస్థితులు గనుక తలెత్తితే ఆహార వస్తువుల ధరలు పెరిగి వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 5 శాతం దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరలను ప్రభుత్వం అదుపు చేయకపోతే అనేక కుటుంబాలు తన దైనందిన అవసరాల కోసం అప్పులు చేయక తప్పని స్థితి ఏర్పడుతుందని విశ్లేషిస్తున్నారు. ఆదాయం పెరగక పోగా.. ఖర్చులు మాత్రం గరిష్ట స్థాయికి చేరడం దేశంలోని మధ్యతరగతి ప్రజల ఆర్థిక పునాదులను దెబ్బతీయనుందని విశ్లేషిస్తున్నారు.

# ఎల్ఐసీ సరికొత్త స్మార్ట్ సేవలు



ప్రభుత్వ దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) తమ పాలసీదారులకు మరింత మెరుగైన, స్మార్ట్ సేవలను అందించడానికి తన డిజిటల్ సేవలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. బుధవారం ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి త్వ శాఖ కార్యదర్శి ఎం. నాగరాజు వినియోగదారుల కోసం 'మైఎల్ఐసీ' యాప్‌ను, సేల్స్ ఏజెంట్ల కోసం 'సూపర్ సేల్స్ సాథీ' యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. "ఎల్ఐసీ డిజిటల్ వ్యవస్థ కేవలం సేవా సౌకర్యంగానే కాకుం డా, వ్యూహాత్మక పంపిణీ వేదికగా మారుతోంది. 26 కోట్ల పాలసీలతో దేశవ్యాప్తంగా విస్తరించిన ఎల్ఐసీకి ఈ మొబైల్ యాప్‌లు సేవా సామర్థ్యాన్ని పెంచ డంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆకాంక్షించారు.

మొబైల్ యాప్‌లు ఇకపై కేవలం సహాయక సాధనాలు మాత్రమే కావు.. ఇవి కస్టమర్ అనుభవాన్ని, పాలసీ విక్రేతల పనితీరును నిర్దేశించే వ్యూహాత్మక ఆస్తులు" అని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి పేర్కొన్నారు. మైఎల్ఐసీ యాప్ ద్వారా పాలసీదారులు ప్రీమియం చెల్లింపులు, పేపర్‌లెస్ లోన్ వంటి సేవలు పొందవచ్చు. సూపర్ సేల్స్ సాథీ యాప్ ఏజెంట్లకు డిజిటల్ సేల్స్ టూల్స్, ఏఐ ఆధారిత కస్టమర్ గైడెన్స్‌ను అందిస్తూ వారి ఉత్పాదకతను పెంచనుందని ఎల్ఐసీ వర్గాలు తెలిపాయి. ఈ వినూత్న యాప్‌లు ఎల్ఐసీ సేవలను మరింత వేగవంతం చేస్తూ, కార్యాలయాలపై ఆధారపడటాన్ని భారీగా తగ్గిస్తాయని వెల్లడించాయి.

# ట్రంప్ కీలక ప్రకటన ? భారీ లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కీలక ప్రకటనతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో త్వరలోనే అమెరికా?ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరిగే అవకాశముందని ఆయన వెల్లడించడంతో పెట్టుబడిదారుల్లో సానుకూల భావనలు నెలకొన్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో దేశీయ సూచీలు గణనీయంగా పెరిగాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే బిఎస్ఈ సెన్సెక్స్ 1,200 పాయింట్లకు పైగా ఎగిసి 78,000 స్థాయిని దాటగా, నిఫ్టీ 50 కూడా 350 పాయింట్లకు పైగా ం
లాభపడి 24,200 మార్క్ వద్ద కొనసాగింది. సూచీలోని పలు ప్రధాన కంపెనీల షేర్లు బలంగా రాణించాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కూడా మార్కెట్లకు ఊరటనిచ్చాయి. హర్మూజ్ సముద్ర మార్గంపై ఉద్రిక్తతల నేపథ్యంలో ఏర్పడిన ఆందోళనలు తగ్గుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లోకి మళ్లాయి. అదే సమయంలో ఃతీవనిబి అతీబీటవ ధర బ్యారెల్‌కు 95 డాలర్ల దిగువకు చేరుకోవడం కూడా పెట్టుబడిదారులకు ధైర్యం ఇచ్చింది. ఈ పరిణామాల సమ్మిళిత ప్రభావంతో దేశీయ మార్కెట్లు నేటి ట్రేడింగ్‌లో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి.

## వరుసగా మూడో రోజు పెరిగిన ధరలు



హైదరాబాద్‌లో వరుసగా బంగారం ధరలు పెరిగిపోయాయి. పెరిగిన ధరలు పసిడి ప్రియులకు షాక్ ఇస్తూ.. పై పైకి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, దేశీయంగా పెరిగిన డిమాండ్ నేపథ్యంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో వరుసగా మూడో రోజు కూడా బంగారం ధరలు పెరిగాయి. గత మూడు రోజుల్లోనే తులం బంగారంపై మూడు వేల రూపాయలకు పైగా పెరుగుదల నమోదు కావడం గమనార్హం. ఈ రోజు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) నేడు రూ.220 పెరగడంతో, తులం బంగారం ధర రూ.1,55,570 కు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) రూ.200 పెరిగింది దీంతో దీని ధర రూ.1,42,600 గా నమోదైంది. గత మూడు రోజులుగా బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మొత్తంగా ఈ మూడు రోజుల్లోనే 24 క్యారెట్ల బంగారంపై రూ.3,110 పెరుగుదల కనిపించింది. 22 క్యారెట్ల బంగారం రూ.2,850 మేర ధర పెరిగింది. హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు స్టాక్ మార్కెట్లలోని అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతుండటమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తుండటంతో సామాన్య ప్రజలపై ఈ ధరల భారం మరింత పడే అవకాశం ఉంది.

## బిల్లుతో లాభం తప్ప నష్టం జరగదు

న్యూఢిల్లీ: డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగనుందంటూ విపక్షాల ఆరోపణలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కౌంటర్ ఇచ్చారు. బిల్లుతో దక్షిణాదిలో పార్లమెంట్ స్థానాలు 129 నుంచి 195 కు పెరుగుతాయి. బిల్లుతో లాభం తప్ప నష్టం జరగదు. బిల్లుపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఈ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు చాలా లాభం, కర్ణాటక, తెలంగాణ బాగా లాభపడతాయి. ఈ బిల్లుతో తెలంగాణలో ఎంపీల సంఖ్య 17 నుంచి 26కు.. ఏపీలో ఎంపీ సీట్లు 25 నుంచి 38కి పెరుతాయి. అలాగే తమిళనాడులో 59కి, కర్ణాటకలో 28 నుంచి 42 స్థానాలు.. కర్ణాటకలో 28 నుంచి 12 స్థానాలకు పెరుగుతాయి. మేం సందేహాలకు సమాధానం ఇస్తాం.. వాకౌట్ చేయాల్సిన పనిలేదని విపక్షాల ఆరోపణలకు అమిత్ ఎద్దేవా చేశారు. కాగా, జనాభా మార్పులను పరిగణనలోకి తీసుకుని పార్లమెంటరీ, రాష్ట్ర శాసనసభనియోజకవర్గాల సరిహద్దులను పునర్ నిర్వచించే ప్రక్రియనే డీలిమిటేషన్ అంటారు...

## మా తొలి మిస్సైల్ దాడికే మీ నౌకలు మునిగిపోతాయ్..

చమురు రవాణాకు ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొత్తాబా ఖమేనీ సైనిక సలాహాదారుడు మోహ్ సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. పార్మ్యాజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే... తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూత్కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారని, ఇది నిజంగా మీరు చేయాల్సిన పనేనా..? అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా..? అని రెజాయ్ ప్రశ్నించారు. హర్మూళ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. తమ క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి అమెరికా నౌకలను ధ్వంసం చేయగలవని పేర్కొన్నారు. మా దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని రెజాయ్ వ్యాఖ్యానించారు. ఇరాన్పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వచ్చిన వార్తలపై కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యూఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు. వారిని విడిపించుకోవాలంటే.. ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా– ఇరాన్ మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

## స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్ను పరీక్షించిన పాక్ నేవీ

కరాచీ: స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీషిప్ మిస్సైల్ను ఇవాళ పాకిస్థాన్ నేవీ విజయవంతంగా పరీక్షించింది. చాలా దూరంలో ఉన్న టార్గెట్లను ఆ మిస్సైల్ చేరుకోగలదని పాక్ మిలిటరీ పేర్కొన్నది. నౌకల నుంచి లాంచ్ చేసే ఆ యాంటిషిప్ మిస్సైలు నేవీ విజయవంతంగా పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ ప్రకటించింది. నేవీ చీఫ్ అడ్మిరల్ నవీద్ అష్రఫ్ తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు.. మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్ను వీక్షించారు. అత్యాధునిక గైడెన్స్ సిస్టమ్తో పాటు అడ్వాన్స్డ్ మాన్యువరబిలిటీ ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల క్షిపణుల నుంచి తప్పించుకునే సామర్థ్యం ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు. పరిస్థితులకు తగినట్లు డైనమిక్ మారుతుందని, చాలా కచ్చితత్వంతో ఆ క్షిపణి ప్రాణాంతకంగా మారుతుందని మిలిటరీ పేర్కొన్నది. ప్రాంతీయ సముద్ర భద్రత, స్థిరత్వం నేపథ్యంలో మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్ నిర్వహించినట్లు చెప్పారు. అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సీడీఎఫ్ అసిమ్ మునీర్ తాజా పరీక్ష పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# ఎడిటోరియల్

## యుద్ధం చేసిన గాయం.. శిథిలమైన బాల్యం

ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్న ఒక వీడియో ప్రపంచాన్ని కన్నీరు పెట్టిస్తుంది. వేల మరణాలను చూసిన పసిబాల్యం ఖననం కూడా ఒక క్రీడగా భావించారో ఏమో కానీ ఒక బొమ్మను శవంలా మోసుకెళ్తూ అంత్యక్రియలు చేస్తున్నట్టుగా ఆడే విధానం అక్కడ చావులు పసి హృదయాలను ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయో తెలుస్తుంది. ఈ సంఘటన సమాజంలో పరిస్థితులను బట్టి పిల్లల ఆలోచనలుంటాయనడానికి నిదర్శనం. ఏ దేశానికైనా పిల్లలే దేశభవిష్యత్తు, పిల్లల అభివృద్దే దేశఅభివృద్ధిగా భావిస్తారు. వారికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తాయి. దేశాన్ని బట్టి వసతులు, సదుపాయాలు మారుతుంటాయి. ఒక్కో దేశ విధానం ఒక్కోలా ఉంటుంది. మనిషి జీవన విధానంలో బాల్యం అత్యంత కీలకమైనది. ప్రపంచ దేశాల్లో పిల్లలకు గౌరవప్రదమైన జీవనం ఇవ్వాలని పోటీపడుతుంటే గాజాలో పిల్లల బాల్యం అత్యంత దుర్భేద్యంగా గడుస్తున్నది. ఎండిన డొక్కలు ఇంకిన కన్నీళ్లు సత్తువ లేని దేహంతో సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ గాజా సరిహద్దుల్లో జరిగిన సూపర్ నోవ మ్యూజికల్ పార్టీపై హమాస్ మిలిటెంట్లు ఆకస్మిక దాడి చేసి వందలకు పైగా ఇజ్రాయెల్ పౌరులను చంపి మరికొందరిని గాజాకు బందీలుగా తీసుకెళ్ళారు. బందీలుగా ఉన్న తమ దేశపౌరులను విడిపించడానికి ఇజ్రాయెల్ పాలస్తీనాపై సైనిక చర్యకు దిగింది. ఇజ్రాయెల్ సైన్యం గగనతలంలో వైమానిక దాడులతోపాటు పాలస్తీనా భూభాగంపై అడుగుపెట్టి భూతలదాడులు చేసింది. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో చేసిన మారణకాండ అంతఇంత కాదు. గాజా నగరాన్ని సర్వనాశనం చేసింది. హమాస్ దాడికి ముందు ప్రశాంతంగా సాగిన పాలస్తీనియన్ల జీవనం ఒక్కసారిగా తలక్రిందులైంది. ఇజ్రాయెల్ దాడిలో హమాస్ మిలిటెంట్ల స్థావరాలతోపాటు జనసముదాయాలు, శరణార్థి శిబిరాలు, ఆసుపత్రులు, పాఠశాలలు ఆర్థిక మౌలిక నిర్మాణాలు ధ్వంసం కావడంతో అపార ప్రాణ నష్టంతోపాటు వేలా మంది నిరాశ్రయులయ్యారు.

ఈ దాడుల్లో ఇప్పటివరకు సుమారు 70,000 మంది పాలస్తీనియన్లు మరణించారని నివేదికలు చెబుతున్నాయి. తినడానికి తిండిలేక తాగడానికి నీళ్ళు లేక గాజాలో ప్రజలు అల్లాడుతున్నారు. గాజాలో పిల్లల వ్యథలు ఎంత వర్ణించినా తక్కువే. అమ్మనాన్నలను కోల్పోయి వేలాది మంది పిల్లలు అనాథలుగా మారరు. సైన్యం దాడిలో వేలమంది పిల్లలు కాళ్ళుచేతులు కోల్పోయి అంగవైకల్యంతో అవిటివారుగా మారితే బాంబుల మోతలు విని విని పసిహృదయాలు కొందరు మానసిక వైకల్యానికి గురైయ్యారు. బడికెళ్లల్సిన బాల్యం బతకడానికి ఆకలితో పోరాడుతున్నారు. పౌష్టికాహారం పక్కన పెడితే అసలు పూటకు తినడానికి తిండి దొరకని పరిస్థితి. పసి పిల్లలు పాలు లేక పెట్టే కేకలు అందరి గుండెల్ని పిండేస్తున్నాయి. కన్నీళ్ళతో కడుపు నిండదని తెలియని బాల్యం పొద్దంతా ఆకలికి ఏడ్చిఏడ్చి అలసిపోతున్నారు. ఎదల మీద ఎదగాల్సిన పిల్లలకు ఆహారాన్ని పెట్టలేక తల్లిదండ్రులు బతికి ఉన్నా జీవత్వం లేని వారుగా ఉన్నారు. సహజంగా పిల్లల బాల్యం ఉదయాన ఆహ్లాదంగా బడివైపు పరుగులు తీస్తే, ఇక్కడి పిల్లల బాల్యం మాత్రం లేవగానే తాగడానికి గుక్కెడు నీళ్లు కోసం, బుక్కెడు అన్నంకోసం ఆకలి పోరాటం చేయాల్సి వస్తుంది. రోజంత మానవతా సహాయం కోసం ఎదురుచూడడం అలవాటైపోయింది. తాగడానికి నీటి అవసరాలకు వాటర్ ట్యాంకర్ల కోసం వేచి చూడడం, రాగానే నీళ్ళను డబ్బాలు క్యాన్లలో నింపడం, కాలిగిన్నెలుతో ఆహారం కోసం పోరాటం అక్కడి బాలల బాల్యంలో దినచర్యగా మారింది. స్వచ్ఛంద సంస్థలు మానవత సహాయంతో తెచ్చే ఆహారంలో ఒక్క మెతుకు కూడా మిగల్చట్లేదంటే అక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. వయసుకు మించి భారాన్ని బరువును మోయడం అలవాటైంది. చదువుకే కాకుండా మనిషి మనుగడకు కావాల్సిన ఏ వ్యవస్థ గాజాలో మనుగడలో లేదు.

పిల్లల భవిష్యత్ నిర్మాణమయ్యే విద్య వ్యవస్థ ఇజ్రాయెల్ దాడుల్లో పూర్తిగా నాశనమైపోయింది. 97 శాతం పాఠశాలలు ధ్వంసమయ్యాయి. ఏడు లక్షలమంది పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. చదవడం తప్ప ఏ బరువు బాధ్యతలు లేకుండా ఎదగల్సిన బాల్యం బతుకు పోరాటంలో అలసిపోతుంది. శిథిలాలమైన భవనాలే ఆట మైదానాలవుతున్నాయి. ఇజ్రాయెల్ సైనిక చర్యకు కారణమైన హమాస్ దాడి వెనక గాజాలోని పిల్ల పాత్ర ఏంటోగాని కనీసం ఉగ్రవాదం ప్రతీకారం యుద్ధం అనే పదాలకు అర్థం తెలియని గాజా పిల్లల బాల్యం మొత్తం అంధకారంలోకి నెట్టివేయబడింది. యూనిసెఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు బాలల కోసం విద్య, వైద్యం ఆహారం పరంగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్న అవి ఏ మూలకు సరిపోవడం లేదు. శిథిలమైన భవనల మధ్య తమ భవిష్యత్ కూడా శిథిలం కాదనే మానసిక స్థైర్యం పిల్లలకు అవసరం. విద్య, వైద్యం పౌష్టికాహారం అందించడానికైన అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ దేశాల మానవత సహాయం చేయడం అవసరం.

# ఈ ప్లేస్‌లో స్ప్రే చేస్తే రోజంతా పరిమళమే!



వేసవి కాలం రాకతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ఈ మార్పు కేవలం మన ఆహారపు అలవాట్లపైనే కాకుండా మనం వాడే సుగంధ ద్రవ్యాల పైన కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. చలికాలంలో రోజంతా తాజాగా అనిపించే పర్ఫ్యూమ్, ఎండాకాలంలో మాత్రం కొద్దిసేపటికే ఆవిరైపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. దేశంలో మారుతున్న వాతావరణానికి అనుగుణంగా మన జీవనశైలిని మార్చుకున్నట్లే, పర్ఫ్యూమ్ ఎంపికలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఎండ వేడికి పర్ఫ్యూమ్ ఎందుకు త్వరగా ఆవిరైపోతుంది? వేసవిలో కూడా రోజంతా పరిమళం వెదజల్లాలంటే ఎటువంటి సువాసనలు ఎంచుకోవాలి? సాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు పర్ఫ్యూమ్‌లో ఉండే తేలికపాటి మూలకాలు చాలా వేగంగా ఆవిరైపోతాయి. దీనివల్ల శీతాకాలంలో రోజంతా ఉండే సువాసన, ఎండాకాలంలో మాత్రం కొద్ది గంటలకే మాయమవుతుంది. దీనికి తోడు చమట తోడైతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది. చమట వల్ల పర్ఫ్యూమ్ సువాసన పలచబడటమే కాకుండా, దాని అసలు వాసన మారిపోయే అవకాశం కూడా ఉంది. అందుకే వేసవిలో పర్ఫ్యూమ్ ఎంపికలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎండాకాలంలో గాఢమైన వాసనల కంటే తేలికపాటి మరియు స్వచ్ఛమైన అనుభూతినిచ్చే సువాసనలను ఎంచుకోవడం ఉత్తమం. నిమ్మ, బెర్గామోట్, మాండరిన్ మరియు ద్రాక్ష వంటి సిట్రస్ నోట్స్ తక్షణమే తాజాదనాన్ని ఇస్తాయి. అలాగే అక్వాటిక్ మరియు మెరైన్ నోట్స్, వెటివర్ లేదా జెరేనియం వంటి వాటితో కలిపి వాడితే గాలిలో తేలుతున్నట్లుగా హాయిగా అనిపిస్తుంది. పుదీనా, తులసి, గ్రీన్ టీ వంటి గ్రీన్ నోట్స్ తీక్షణతను ఇస్తే.. జాస్మిన్, రోజ్ వంటి పూల సువాసనలు సున్నితత్వాన్ని అందిస్తాయి. అయితే ఈ తేలికపాటి పర్ఫ్యూమ్‌లు గాఢమైన వాటిలా ఎక్కువ సేపు ఉండవని గుర్తించాలి. సువాసన ఎక్కువ సేపు ఉండాలంటే దానిని ఉపయోగించే విధానం కూడా చాలా ముఖ్యం. పొడి చర్మం కంటే తేమగా ఉన్న చర్మంపై పర్ఫ్యూమ్ ఎక్కువ సేపు నిలుస్తుంది. కాబట్టి స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజర్ రాసుకుని, ఆపై పర్ఫ్యూమ్ కొట్టుకోవడం మంచిది. ముఖ్యంగా మణికట్టు, మెడ, చెవుల వెనుక వంటి 'పల్స్ పాయింట్స్' దగ్గర స్ప్రే చేయడం వల్ల శరీర వేడికి సువాసన సహజంగా వ్యాపిస్తుంది. ఒకే రకమైన సువాసన కలిగిన లోషన్ లేదా పౌడర్ వాడటం వల్ల పర్ఫ్యూమ్ ప్రభావాన్ని పెంచవచ్చు. వేసవిలో ఒకేసారి కొట్టుకుని రోజంతా ఉండాలని ఆశించడం కంటే, ప్రతి కొన్ని గంటలకు ఒకసారి పర్ఫ్యూమ్‌ను మళ్ళీ స్ప్రే చేయడం ఉత్తమం. ఇందుకోసం చిన్న సైజులో ఉండే ట్రావెల్ ప్యాక్‌లు లేదా పాకెట్ పర్ఫ్యూమ్‌లను వెంట ఉంచుకోవడం ప్రాక్టికల్ గా ఉంటుంది. వేసవిలో పర్ఫ్యూమ్ వాడటం అనేది కేవలం ఎదుటివారిని ఆకర్షించడం కోసం మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్న వాతావరణానికి మనం అలవాటు పడటం కోసం కూడా. సరైన పర్ఫ్యూమ్‌ను ఎంచుకుని, దానిని సరిగ్గా ఉపయోగిస్తే ఎండల తీవ్రతలో కూడా మీరు ఎప్పుడూ ఉత్సాహంగా, తాజాగా కనిపిస్తారు.

# ఇండక్షన్ స్టౌపై ఈ వృత్తాకార గుర్తు ఎందుకు ఉంటుంది?




ప్రస్తుతం సర్వత్రా ఎల్‌పిజి గ్యాస్ కొరత వేదిస్తుంది. దీంతో దాదాపు అన్ని ఇళ్లల్లో ఇండక్షన్ వాడకం పెరిగింది. కానీ మీరు ఎప్పుడైనా దానిని దగ్గరగా గమనించారా? ఇండక్షన్‌పై ఒక ప్రత్యేకమైన గుండ్రని ఆకారం ఉంటుంది. అది దేనికి ఉపయోగపడుతుందో మీకు ఎప్పుడైనా సందేహం కలిగిందా? మనం దాదాపు దీనిని పట్టించుకోము. ఇది కేవలం పాత్రలు స్టవ్‌పై ఉంచడానికి మాత్రమే అని అనుకుంటాం. ప్రస్తుతం సర్వత్రా ఎల్‌పిజి గ్యాస్ కొరత వేదిస్తుంది. దీంతో దాదాపు అన్ని ఇళ్లల్లో ఇండక్షన్ వాడకం పెరిగింది. కానీ మీరు ఎప్పుడైనా దానిని దగ్గరగా గమనించారా? ఇండక్షన్‌పై ఒక ప్రత్యేకమైన గుండ్రని ఆకారం ఉంటుంది. అది దేనికి ఉపయోగపడుతుందో మీకు ఎప్పుడైనా సందేహం కలిగిందా? మనం దాదాపు దీనిని పట్టించుకోము. ఇది కేవలం పాత్రలు స్టవ్‌పై ఉంచడానికి మాత్రమే అని అనుకుంటాం. ఈ వలయం కేవలం పాత్రల కోసం మాత్రమే కాదు, ఇది మీ ఇంటి విద్యుత్ బిల్లును కూడా నిర్ధారిస్తుంది. అంతేకాకుండా మీ ఇండక్షన్ ఎంతకాలం పనిచేస్తుందో కూడా ఇది నిర్ణయిస్తుంది. ఇండక్షన్ గ్లాస్‌పై ఉన్న వృత్తానికి కొంచెం కింద రాగి లేదా అల్యూమినియంతో చేసిన అయస్కాంత కాయిల్ ఉంటుంది. మీరు స్విచ్ ఆన్ చేసినప్పుడు, ఈ కాయిల్ విద్యుదయస్కాంత తరంగాలను ఉత్పత్తి చేస్తుంది. మీరు పాత్రను ఈ వృత్తం మధ్యలో ఉంచినట్లయితే, 90 శాతం శక్తి పాత్రను వేడి చేయడానికి ఉపయోగించబడుతుంది.

ఒకవేళ పాత్ర వృత్తం వెలుపల ఉన్నా లేదా వృత్తం కంటే చాలా చిన్నదిగా లేదా పెద్దదిగా ఉన్నా అయస్కాంత తరంగాలు పాత్రకు సరిగ్గా చేరవు. దీనివల్ల ఆహారం నెమ్మదిగా ఉడుకుతుంది. ఫలితంగా విద్యుత్ వినియోగం అధికమవుతుంది. మీరు గిన్నె అడుగుభాగం చుట్టుకొలతకు సరిపోని విధంగా దానిని ఉంచితే, గిన్నెను వేడి చేయడానికి ఇండక్షన్ రెట్టింపు కష్టపడాల్సి వస్తుంది. దీనివల్ల ఆహారం ఉడకడానికి 15 నుండి 20 నిమిషాలు ఎక్కువ సమయం పట్టవచ్చు. అంతేకాకుండా దీనివల్ల మీ విద్యుత్ బిల్లు 20 నుండి 30 శాతం వరకు పెరగవచ్చు. ఈ గుండ్రని రింగ్ కింద ఉష్ణోగ్రతను నియంత్రించే సెన్సార్లు అమర్చబడి ఉంటాయి. పాత్రాను తప్పుగా అమర్చితే, ఇండక్షన్ కాయిల్ అధికంగా వేడెక్కుతుంది. దీనివల్ల మెషీన్‌లోని మెయిన్ సర్క్యూట్ (ఖఅః) కాలిపోయే అవకాశాలు పెరుగుతాయి. అంతేకాకుండా మీ ఖరీదైన ఇండక్షన్ అకాలంగా పాడైపోవచ్చు. అందువల్ల, ఇండక్షన్ మీద వంట చేసేటప్పుడు పాత్రను ఎల్లప్పుడూ వృత్తంకి సరిగ్గా సరిపోలా చూసుకోవాలి. వీలైతే, ఇండక్షన్ వృత్తం పరిమాణంలోనే ఉండే, చదునైన అడుగుభాగం గల పాత్రలను వాడటం మంచిది. పాత్ర మరీ పెద్దదిగా గానీ, మరీ చిన్నదిగా గానీ ఉండకూడదు.

# జ్ఞాపకశక్తి మందగిస్తోందా..?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మతి మరుపు అనేది వయసుతో సంబంధం లేకుండా అందరినీ వేధిస్తున్న సమస్య. ముఖ్యంగా జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి అలవాటు పడటం వల్ల మెదడు పనితీరు మందగిస్తోంది. అయితే, మన ఇంట్లో దొరికే సహజసిద్ధమైన ఆహారంతోనే జ్ఞాపకశక్తిని అద్భుతంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మతి మరుపు అనేది వయసుతో సంబంధం లేకుండా అందరినీ వేధిస్తున్న సమస్య. ముఖ్యంగా జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి అలవాటు పడటం వల్ల మెదడు పనితీరు మందగిస్తోంది. అయితే, మన ఇంట్లో దొరికే సహజసిద్ధమైన ఆహారంతోనే జ్ఞాపకశక్తిని అద్భుతంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. బయటి ఆహారంలో ఉండే ప్రిజర్వేటివ్స్, మితిమీరిన ఉప్పు, చక్కెర మెదడులోని నాడులను బలహీనపరుస్తాయి. దీనికి విరుద్ధంగా, ఇంట్లో వండుకునే భోజనంలో ఉండే పోషకాలు మెదడుకు కావాల్సిన ఇంధనాన్ని అందిస్తాయి. పాలకూర, తోటకూర వంటి వాటిలో ఉండే ఫోలేట్, విటమిన్ ఐ మెదడు కణాల క్షీణతను అడ్డుకుంటాయి. మన వంటింట్లో ఉండే యాంటీ సెప్టిక్ పసుపు. ఇందులో ఉండే కర్క్యుమిన్ మెదడులోని వాపును తగ్గించి, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. వాల్ నట్స్, బాదం, అవిసె గింజల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు చురుకుదనానికి తోడ్పడతాయి. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి తృణధాన్యాల వల్ల మెదడుకు శక్తి నిరంతరాయంగా అందుతుంది. పేగు ఆరోగ్యం బాగుంటేనే మెదడు బాగుంటుంది. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంచుతాయి. మనం తీసుకునే ఆహారం కేవలం కడుపు నింపడానికే కాదు.. అది మన ఆలోచనా సరళిని, జ్ఞాపకశక్తిని కూడా నిర్దేశిస్తుంది. ఇంట్లో వండుకున్నా సరే, మితిమీరిన కారం, నూనె మెదడుపై ప్రభావం చూపుతాయి. రోజూ ఒక సీజనల్ పండు తినడం వల్ల మెదడుకు అవసరమైన యాంటీ ఆక్సిడెంట్స్ అందుతాయి. డీహైడ్రేషన్ వల్ల కూడా మతిమరుపు వస్తుంది, కాబట్టి రోజూ సరిపడా నీరు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# పంజాబ్ వేటాడేసింది

## ముంబయిపై ఘనవిజయం
## మెరిసిన ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్
## విజృంభించిన అర్ష్‌దీప్
## డికాక్ శతకం వృథా



వాంఖడేలో బ్యాటింగ్ పిచ్..! ఈ సీజన్ ఐపీఎల్‌లో తొలిసారి బరిలోకి దిగిన క్వింటన్ డికాక్ సెంచరీ బాదేయడంతో ముంబయి 195 పరుగులు చేసింది. బుమ్రాతో కూడిన బౌలింగ్ దళం ఉన్నా సొంతగడ్డపై ముంబయి.. ఆ స్కోరును కాపాడుకోలేకపోయింది. పంజాబ్ దూకుడే ఇందుకు కారణం. సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ చెలరేగిన పంజాబ్.. ముంబయిని చిత్తుగా ఓడించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మెరుపులతో పంజాబ్ అలవోకగా లక్ష్యాన్ని అందుకుంది. అయిదు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకిది నాలుగో గెలుపు. ఒక మ్యాచ్ వర్షంతో రద్దయింది. మరోవైపు తొలి మ్యాచ్‌లో నెగ్గిన ముంబయికి ఇది వరుసగా నాలుగో ఓటమి.

ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతోంది. ఆ జట్టు మరో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. గురువారం శ్రేయస్ బృందం 7 వికెట్ల తేడాతో ముంబయిని ఓడించింది. మొదట ముంబయి 6 వికెట్లకు 195 పరుగులు చేసింది. డికాక్ (112 నాటౌట్; 60 బంతుల్లో 8x4, 7x6) అజేయ సెంచరీ సాధించాడు. నమన్ ధీర్ (50; 31 బంతుల్లో 3x4, 3x6) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ సింగ్ (3/22) సత్తా చాటాడు. ప్రభ్‌సిమ్రన్ (80 నాటౌట్; 39 బంతుల్లో 11x4, 2x6), శ్రేయస్ (66; 35 బంతుల్లో 5x4, 4x6) మెరుపులతో పంజాబ్ 16.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

**ఆ ఇద్దరి దూకుడు:**

పంజాబ్ ఛేదన ధాటిగా మొదలైంది. ఈ సీజన్లో స్థిరంగా ఆడుతున్న ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (15), ప్రభ్‌సిమ్రన్ సింగ్ మరోసారి దూకుడుగా ఆడారు. దీపక్ చాహర్ వేసిన తొలి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ 2 ఫోర్లు, ఆర్య సిక్స్, ఫోర్ బాదడంతో 21 పరుగులొచ్చాయి. 2 ఓవర్లకు 26/0తో పంజాబ్ ఛేదనకు మంచి పునాది వేసుకుంది. కానీ స్పిన్నర్ ఘజన్‌ఫర్ రెండు ఓవర్ల వ్యవధిలో ఆర్య, కూపర్ కనోలీ (17) వికెట్లు తీసి పంజాబ్‌ను దెబ్బ కొట్టాడు. ఆ స్థితిలో ప్రభ్‌సిమ్రన్‌కు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జత కలవడంతో పంజాబ్ ఇన్నింగ్స్ దూసుకెళ్లింది. వీళ్లిద్దరూ పోటీపడి షాట్లు ఆడడంతో 10 ఓవర్లకు పంజాబ్ 100/2తో నిలిచింది. ఈ క్రమంలో ప్రభ్‌సిమ్రన్ 23 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. బుమ్రా వేసిన 13వ ఓవర్లో శ్రేయస్.. ఓ సిక్స్, ఫోర్.. తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ సిక్స్, ఫోర్ బాదడంతో పంజాబ్‌కు సమీకరణం (36 బంతుల్లో 35) బాగా అందుబాటులోకి వచ్చేసింది. దూకుడు కొనసాగించిన శ్రేయస్.. 31 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. అతడికిది వరుసగా మూడో అర్ధశతకం. శ్రేయస్ ఔటైనా.. ప్రభ్‌సిమ్రన్ పని పూర్తి చేశాడు. మరో 21 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ విజయాన్ని అందుకుంది. వరుసగా అయిదో మ్యాచ్‌లోనూ బుమ్రా వికెట్ పడగొట్టకపోవడం గమనార్హం.

**డికాక్ 112 నాటౌట్**

**నిలిచిన డికాక్, ధీర్:**

అంతకుముందు ముంబయి ఇన్నింగ్స్‌లో క్వింటన్ డికాక్ ఆటే హైలైట్. గాయపడిన రోహిత్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన అతడు ఈ సీజన్లో తన తొలి మ్యాచ్‌లోనే అదిరే సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఇన్నింగ్స్ ఆసాంతం నిలిచిన అతడు.. జట్టు 200కు చేరువగా వెళ్లడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే ముంబయి ఇన్నింగ్స్ ఆరంభమైన తీరే పేలవం! 12 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. మూడో ఓవర్లో అర్ష్‌దీప్ వరుస బంతుల్లో రికెల్టన్ (2), సూర్యకుమార్ (0)లను ఔట్ చేసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న డికాక్, ధీర్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీళ్లిద్దరూ సిక్స్‌లు, ఫోర్ల వేటలో సాగడంతో ముంబయి 10 ఓవర్లకు 97/2తో నిలిచింది. ఈ క్రమంలోనే డికాక్ 28 బంతుల్లో, ధీర్ 29 బంతుల్లో అర్ధసెంచరీలు అందుకున్నారు.

# సన్ రైజర్స్ కు ఎదురుదెబ్బ... గాయంతో సీజన్ మొత్తానికి దూరమైన కొత్త బౌలర్

## గాయం కారణంగా ఐపీఎల్ సీజన్‌కు దూరమైన డేవిడ్ పేన్
## రెండు మ్యాచ్‌లు ఆడిన పేన్.. 14 ఎకానమీతో కేవలం రెండు వికెట్లు
## ఫిట్‌నెస్ టెస్టులో పాసై జట్టులోకి రానున్న కెప్టెన్ ప్యాట్ కమిన్స్
## పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్న సన్‌రైజర్స్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం కారణంగా మిగిలిన సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్‌ఆర్‌హెచ్ ఫ్రాంచైజీ 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించింది. అయితే, అతని స్థానంలో ఎవరినీ భర్తీ చేస్తున్నట్లు ఇంకా వెల్లడించలేదు. సీజన్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా పేసర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయపడటంతో అతని స్థానంలో డేవిడ్ పేన్‌ను ఎస్‌ఆర్‌హెచ్ జట్టులోకి తీసుకుంది. పేన్ బిగ్ బాష్ లీగ్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ, ఐపీఎల్‌లో మాత్రం ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. ఎస్‌ఆర్‌హెచ్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడి, 14 ఎకానమీ రేటుతో కేవలం రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ప్రస్తుతం ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో 5 మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్, రెండింటిలో గెలిచి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్‌పై 57 పరుగుల తేడాతో ఎస్‌ఆర్‌హెచ్ ఘనవిజయం సాధించింది.

ఇక తమ తదుపరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టు శనివారం నాడు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది.


ఇదిలా ఉండగా, సన్‌రైజర్స్ జట్టుకు ఓ శుభవార్త అందింది. గాయంతో దూరమైన రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. త్వరలోనే అతను జట్టుతో కలవనున్నాడు. ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో కమిన్స్ ఆడే అవకాశం ఉంది. ప్రస్తుతం కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు.



నేహా శెట్టి పీచ్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

# పెద్ది చుట్టూ మూడు 'సవాళ్లు'.. ఏం జరుగుతుందో?

టాలీవుడ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం నటిస్తున్న భారీ చిత్రం పెద్ది విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. ఆ సినిమాపై ప్రస్తుత పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చగా మారింది. ముఖ్యంగా ఏప్రిల్ 30న విడుదల నేపథ్యంలో మూడు విషయాలు ఆ చిత్రానికి సవాళ్లుగా నిలుస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. అసలేమైంది? అవేంటి?



మొదటిది.. మిడిల్ ఈస్ట్ లో కొనసాగుతున్న ఇజ్రాయెల్-అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం. యుద్ధ వాతావరణం కారణంగా ఇంటర్నేషనల్ మార్కెట్ లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉంది. అందుకే రవాణా ఖర్చులు పెరగడం వల్ల సినిమా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్యపై ప్రభావం పడే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.ఇదే పరిస్థితి నెల రోజులు కొనసాగితే, పెద్ది సినిమా థియేట్రికల్ కలెక్షన్లపై కూడా ఆ ఎఫెక్ట్ పడొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి.

అదే సమయంలో రెండో సవాల్ విషయానికొస్తే.. బాలీవుడ్ చిత్రం ధురంధర్ 2. బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లు సాధిస్తూ, ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేక్షకుల ఖర్చు సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది.ఫిబ్రవరిలో సంక్రాంతి సినిమాలపై భారీగా ఖర్చు చేసిన ప్రేక్షకులు తర్వాత కొంత కాలం సినిమాలకు దూరంగా ఉన్నట్లు, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడవచ్చని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో బ్యాండ్ మేళం, డెకాయిట్, బైకర్, స్వయంభూ వంటి చిన్న, మీడియం రేంజ్ చిత్రాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటే, ఏప్రిల్ చివరికి ప్రేక్షకుల ఖర్చు కోసం ఆలోచించే అవకాశం ఉంది.ముఖ్యంగా ఇప్పుడు మూడో సవాల్.. ఐపీఎల్. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆ టోర్నీ క్రేజ్ హై లెవెల్ లో ఉంటుంది. ముఖ్యంగా ఆర్సీబీ, రాజస్థాన్ జట్లు కొత్త యజమానులతో భారీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ రెండు ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి, తమ జట్లను మరింత అట్రాక్టివ్ గా మార్చే ప్రయత్నంలో ఉన్నాయి. దీంతో ప్రేక్షకుల దృష్టి ఎక్కువగా క్రికెట్ పైనే ఉంటోంది.టెలివిజన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో ఐపీఎల్ మ్యాచ్ లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుండటంతో, సినిమాలకు తగిన స్పేస్ దక్కకపోవచ్చని ప్రచారం జరుగుతోంది. అలా మూడు సవాళ్ల మధ్య పెద్ది రిలీజ్ అవుతోంది. అయినప్పటికీ రామ్ చరణ్ స్టార్ డమ్, సినిమాపై ఉన్న అంచనాలు, కంటెంట్.. అన్నీ కలిసి ఆ అడ్డంకులను అధిగమించగలవా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పెద్ది ఎలా రాణిస్తుందోననేది హాట్ టాపిక్ గా మారింది. ప్రేక్షకుల రెస్పాన్స్, మౌత్ టాక్, ఓపెనింగ్ కలెక్షన్లే సినిమా ఫ్యూచర్ ను డిసైడ్ చేయనున్నాయనే చెప్పాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com